జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 30 | నవంబర్ | 2025 ◆ పేజీలు : 5

# దీక్షా దివస్ లో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు



**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 29 – ప్రజాజ్యోతి:** బీసీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరుగాలంటే, అది తమ పార్టీ పాలనలోనే సాధ్యమవుతుందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. గాంధీజీ చూపిన అహింసా మార్గంలో మహోద్యమాన్ని నడిపించి కఠోరమైన దీక్ష చేబూని ఢిల్లీ పాలకుల మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెట్టిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు

మిగతా 2 లో...





# చారిత్రాత్మక వేడుకకు ... పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 29, ప్రజా జ్యోతి** చారిత్రాత్మక వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి 'డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ' ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై శనివారం యూనివర్సిటీ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ప్రతిష్టాత్మకంగా, ఎలాంటి లోపాలూ లేకుండా నిర్వహించేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు, డిసెంబర్ 2న మధ్యాహ్నం 2 గంటలకు ఐడిఓసి కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన హెలిపాడ్ లో హెలికాప్టర్ ల్యాండింగ్ ఉంటుందని, హెలిపాడ్ పరిసరాల్లో గ్రీన్ రూమ్ వాహనం, భద్రతా చర్యలు, పరిశుభ్రత వంటి అంశాలను కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. స్టేట్ చాంబర్ వద్ద కూడా పరిశుభ్రతను నిర్ధారించి సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ శిలాఫలకం వద్దకు చేరుకునే వివిఐపీల రవాణా కోసం మినీ బస్సులు ఏర్పాటు చేసి, ఈ ప్రక్రియను పాల్వంచ తాసిల్దార్ పర్యవేక్షించాలని ఆదేశించారు. శిలాఫలకం వద్ద పూల అలంకరణ, గ్రీన్ మ్యాట్ ఏర్పాట్లు, వీఐపీల ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు ఉండేలా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్

మిగతా 2 లో...



# 11 మంది మావోయిస్టులు లొంగుబాటు

- **ఏం ఏం సి జోన్ ప్రతినిధి అనంత్ అలియాస్ వికాస్ లొంగుబాటు**
- **అనంత్ పై 25 లక్షల రివార్డు**
- **లొంగిపోయిన మావోయిస్టులపై 89 లక్షల రివార్డ్**

**చర్ల, నవంబర్ 29 (ప్రజాజ్యోతి ):** ఎంఎంసి జోన్ ప్రతినిధి అనంత్ అలియాస్ వికాస్ జనవరి 1 న లొంగిపోతామని మీడియాకు లేఖ విడుదల చేసిన మరు నాడే తనతో పాటు మరో పది మంది మావోయిస్టులను మహారాష్ట్ర లోని గోండియాలో గడ్చిరోలి జోన్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ జనరల్ అంకిత్ గోయల్ సమక్షంలో లొంగిపోయారు.లొంగిపోయిన వారిలో ఐదుగురు మహిళా మావోయిస్టులు ఉన్నారు. అనంత్ పై రూ 25 లక్షల రివార్డ్ ఉందని గోండియా జిల్లా ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల పై రూ 89 లక్షల రివార్డ్ ఉందని వెల్లడించారు.మహారాష్ట్ర ప్రభుత్వం 2005 లో లొంగుబాటు ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. గోండియా జిల్లాలో ఇప్పటి వరకూ 37 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు అనంత్ తో పాటు మరో పది మంది మొత్తం 11 మంది మావోయిస్టుల

మిగతా 2 లో...

# సర్పంచ్ నామినేషన్ షురూ....






**పాల్వంచ(టౌన్),నవంబర్ 29 (ప్రజా జ్యోతి):** పాల్వంచ మండల పరిధిలోని గ్రామపంచాయతీలో రెండో విడత సర్పంచ్ ఎలక్షన్ నామినేషన్లు షురూ, బరిలో ఉండే అభ్యర్థులు కింది విధానాలను గమనించగలరు. తేదీ ఆదివారం 30 నవంబర్ 2025 నుండి 02 డిసెంబర్ 2025 వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00గంటల వరకు నామినేషన్లు రిటర్నింగ్ ఆఫీసర్ స్వీకరిస్తారు.తేదీ 03 డిసెంబర్ 2025 న సర్పంచ్ నామినేషన్ల పరిశీలన,చల్లుబాటువైన నామినేషన్ల అభ్యర్థుల జాబితా ఖరారు చేయబడతారు. తేదీ 04 డిసెంబర్ మరియు 05 డిసెంబర్ 2025న అభ్యర్థుల అప్లై,వాటి యొక్క పరిశీలన. తేదీ 6 డిసెంబర్ 2025న పోటీ చేస్తున్నటువంటి అభ్యర్థుల

2 లో...

# సుభాష్ నగర్ మాజీ సర్పంచ్ మిస్సింగ్

- **శుక్రవారం రాత్రి నుంచి కనబడటం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు**
- **బిఆర్ఎస్ లోనే ఉన్న మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ**

**ఇల్లెందు, నవంబర్ 29, ప్రజాజ్యోతి:** మండలంలోని సుభాష్‌నగర్ పంచాయితీ మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ పార్టీకి చెందిన వల్లాల మంగమ్మ శుక్రవారం రాత్రి నుంచి కనబడటం లేదు. భర్త వల్లాల నరసయ్య, కుమారుడు మణికంఠ తెలిపిన వివరాల ప్రకారం మాజీ సర్పంచ్, సుభాష్ నగర్ ప్రస్తుత సర్పంచ్ అభ్యర్థి వల్లాల మంగమ్మ శుక్రవారం రాత్రి నుంచి కనబడటం లేదన్నారు. ఈనెల 28వ తేదీ రాత్రి నుంచి తన ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని తమ బంధువులు, తెలిసిన వాళ్ళ ఇండ్లలో

మిగతా 2 లో...





# దీక్షా దివస్ లో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు

(మొదటి పేజీ తరువాయి...)

తెలంగాణ జాతిపిత అని కొనియాడారు.దీక్షా దివస్ సందర్భంగా కొత్తగూడెం తెలంగాణ భవన్ లో శనివారం జరిగిన సమావేశానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు.బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ అధ్యక్షులు, ప్రభుత్వ మాజీ విప్ రేగా కాంతారావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు,బానోతు హరిప్రియ హరిసింగ్ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దిండిగల రాజేందర్, మునిసిపల్ మాజీ ఛైర్పర్సన్ కాపు సీతాలక్ష్మీ, టిబిజికెఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపుకృష్ణ తదితర ప్రముఖులు ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ,రాష్ట్రంలో రెండేళ్ల నుంచి రాక్షస పాలన సాగుతున్నదని,బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ నాయకులు ఊక దంపుడు ఉపన్యాసాలిచ్చి మోసం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు.కామారెడ్డి బహిరంగ సభలో కాంగ్రెస్ నాయకులు 42 శాతం రిజర్వేషన్లతో పాటు బీసీల సంక్షేమం, అభివృద్ధికి 56 వాగ్దానాలు చేసి, ఆచరణలో మాత్రం ఏ ఒక్కటి కూడా అమలుపర్చలేదని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు.ఎన్నికల నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లు 23 శాతం కాకుండా అందులో సగం సర్పంచ్ స్థానాలను కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు.బీసీలు మాత్రమే కాకుండా కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, మహిళలు, మైనారిటీలు రేవంత్ రెడ్డి పాలనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చేందుకు గాను కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టి ఈరోజుకు 16 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. ఇది మర్చిపోలేని, మరుపురాని చారిత్రాత్మకమైన రోజు అని, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెట్టడమే కాక అన్ని రంగాలలో గొప్పగా అభివృద్ధి చేసిన కేసీఆర్ పేరు ప్రఖ్యాతలు సూర్యచంద్రులు ఉన్నంత వరకు నిలిచి ఉంటాయని ఎంపీ వద్దిరాజు వివరించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్, మంత్రిగా కేటీఆర్ ఉన్న పదేళ్లలో హైదరాబాద్ ఐటీ, ఫార్మా రంగాలలో అగ్రగామిగా నిలిచిందని,ఈ వాస్తవాన్ని నిన్న ఒక సందర్భంలో బీజేపీ నాయకులు కూడా ప్రస్తావించడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ 25వ వ్యవస్థాపన దినోత్సవం సందర్భంగా వరంగల్ లో జరిగిన భారీ బహిరంగ సభకు 10 లక్షలకు పైగా జనం తరలివచ్చి పార్టీకి, మహానేత కేసీఆర్ బ్రహ్మరథం పట్టడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ ముక్తకంఠంతో కోరుకుంటున్నారని,అప్పుడే తమకు న్యాయం జరుగుతుందని బీసీలతో పాటు అన్ని వర్గాల వారు ఎదురు చూస్తున్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ఈ దీక్షాదివస్ సందర్భంగా ఇందుకోసం మనమందరం ప్రతిన బూనుదాం అని ఎంపీ వద్దిరాజు బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.సమావేశానికి ముందు తెలంగాణ అమరవీరుల స్థూపానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. మహానేత కేసీఆర్ నాయకత్వాన జరిగిన తెలంగాణ మహోద్యమానికి సంబంధించిన ఛాయా చిత్రపదర్శనను ఏర్పాటు చేశారు.రాష్ట్రాన్ని సాధించి పెట్టి తెలంగాణ ప్రజల దాస్య శృంఖలాలు తెంచిన మహానేత, అభివృద్ధి ప్రధాత కేసీఆర్ నిలువెత్తు ఫోటోకు ఎంపీ రవిచంద్ర,మాజీ ఎమ్మెల్యేలు పాలాభిషేకం చేశారు.తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి,తెలంగాణ తల్లి విగ్రహానికి పూలజల్లిన తర్వాత సమావేశం ప్రారంభమైంది.కార్యక్రమంలో నాయకులు రంగనాథ్,కనకేష్‌పటేల్, రాజా గౌడ్, తొగరు రాజశేఖర్, కే.నవతన్, అనుదీప్, శాంతి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. దీక్షాదివస్ సందర్భంగా తెలంగాణ భవన్, దాని పరిసరాలు గులాబీ మయంగా మారింది, జెండాలు, ఫ్లెక్సీలు,బ్యానర్లు,తోరణాలతో నిండిపోయింది.ఈ సమావేశానికి పలువురు ఉద్యమకారులు,గులాబీ కండువాలు ధరించిన బీఆర్ఎస్ శ్రేణులు సుమారు 3వేల మంది హాజరయ్యారు,వీరంతా "జై తెలంగాణ జైజై తెలంగాణ","జోహార్లు జోహార్లు తెలంగాణ అమరవీరులకు జోహార్లు","జిందాబాద్ జిందాబాద్ బీఆర్ఎస్ జిందాబాద్", "వర్ధిల్లాలి వర్ధిల్లాలి కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి"అంటూ పెద్ద పెట్టున నినాదాలిచ్చారు.సమావేశం అనంతరం అందరూ కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

# 11 మంది మావోయిస్టులు లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి...)

లొంగుబాటు జరిగిందన్నారు. కొందరు ఆయుధాలతో లొంగిపోయినట్లు పోలీసు అధికారులు తెలిపారు. అనంత్ కరీంనగర్ జిల్లాకు చెందిన వ్యక్తి.శుక్రవారం లొంగిపోయిన వారిలో డీవీసీఎం, ఏసిఎం ప, దళ సభ్యులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు తెలంగాణా రాష్ట్రం లోని కరీంనగర్ కు చెందిన అనంత్,వినోద్.జగిత్యాల జిల్లాకు చెందిన ప్రతాప్ అలియాస్ సమర్ లు ఉన్నారు. మిగిలిన వారు మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల కు చెందిన వారు.లొంగిపోయిన వారికి మహారాష్ట్ర ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని తెలిపారు.

# చారిత్రాత్మక వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



(మొదటి పేజీ తరువాయి...)

యూనివర్సిటీ ప్రారంభోత్సవంలో భాగంగా నిర్వహించాల్సిన పూజా కార్యక్రమాల ఏర్పాట్లపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సింగరేణి మైనింగ్ కాలేజ్ ఏర్పాటుతో ప్రారంభమైన ఈ విద్యాసంస్థ డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా అభివృద్ధి చెందే వరకు జరిగిన చారిత్రాత్మక ఘట్టాలను ప్రతిబింబించేలా ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాట్లు కూడా ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో జరగాలని తెలిపారు. వీఐపీల స్వాగతం ,సన్మాన కార్యక్రమాల్లో పాల్గొనబోయే విద్యార్థులు, ప్రొఫెసర్లు ముందుగానే ఖరారుచేయాలని సూచించారు. ఉదయం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లు కూడా చేయాలని సూచించారు. అగ్నిమాపకశాఖ తగిన సంఖ్యలో ఫైర్ ఇంజిన్లను సిద్ధంగా ఉంచి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్యశాఖ అధికారులు హెలిపాడ్, కాన్వాయ్ మార్గం, సభా ప్రాంగణం వద్ద అంబులెన్స్ సేవలు, అత్యవసర వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి తగిన వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అంతర్గత రహదారుల మరమ్మత్తులు, అకాడమిక్ బ్లాక్ భవనాల వైట్‌వాష్ వంటి మౌలిక పనులను పంచాయతీ శాఖ అత్యవసరంగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. రహదారులు, వేదిక, సౌండ్ సిస్టమ్ వంటి పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆర్అండ్‌బి శాఖకు ఆదేశాలు జారీ చేశారు. మిషన్ భగీరథ అధికారులు సభా ప్రాంగణం, గ్యాలరీలలో తాగునీటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ శాఖ జనరేటర్లు , నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేయాలని కలెక్టర్ సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలు , విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడపాలని సూచించారు. ఇంటర్ కళాశాల, ఐటీఐ, పాలిటెక్నిక్, అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు సభలో విచ్చేలా రవాణా శాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు భోజన సదుపాయం మహిళా సంఘాల సభ్యుల సమీకరణ పర్యవేక్షించాల్సిందిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనను ఆదేశించారు. సభా ప్రాంగణం వద్ద పుట్టగొడుగుల పెంపకం, సోలార్ డ్రైయర్, లైవ్లీహుడ్ ప్రాజెక్టులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన అనుమతులు రేపటి లోపు పూర్తిచేయాలని, డిసెంబర్ 1 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ సంబంధిత శాఖలను ఆదేశించారు. ప్రోటోకాల్ అమలు, వీఐపి ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షణలో వ్యవహరించాలని సూచించారు. సమీక్ష అనంతరం కలెక్టర్, ఎస్పీ, అధికారులు కలిసి శిలాఫలకం పరిసరాలు, సభా ప్రాంగణం, వేదిక, రవాణా మార్గాల ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించి, తగిన సూచనలు జారీ చేశారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి పర్యటన ఓ కీలక మైలురాయిగా నిలుస్తుందని, ఈ పర్యటనను ఘనవిజయవంతం చేయడానికి శాఖలు సమిష్టిగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకుగాను భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి కార్యక్రమం మొత్తం ప్రోటోకాల్‌కు పూర్తిస్థాయిలో అనుగుణంగా సాగేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని విభాగాల సమన్వయంతో బలమైన భద్రతా ప్రణాళికను సిద్ధం చేసిందని పేర్కొన్నారు. సీఎం కాన్వాయ్ ఆగే ప్రతి స్థలం, మార్గమధ్య ప్రాంతాలు, సభా ప్రాంగణం, శిలాఫలకం వద్ద ఏర్పాటు చేసిన వేదికల వద్ద సిబ్బందిని తగిన బందోబస్తుతో మోహరించామని వివరించారు. అదేవిధంగా వీఐపీల రాకపోకలకు సంబంధించిన ప్రత్యేక వాహన పాసులు, వాహనాల నిల్వ, ప్రవేశ నియంత్రణ, గేటు నిర్వహణ వంటి అంశాలను ఖచ్చితమైన పరిశీలనతో అమలు చేయనున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సమయంలో ఎటువంటి అంతరాయం కలగకుండా ఇంటెలిజెన్స్ వింగ్, ట్రాఫిక్ వింగ్, లా అండ్ ఆర్డర్ విభాగాలు పరస్పరం సమన్వయంతో పని చేయనున్నాయని చెప్పారు. సభకు భారీగా వచ్చే ప్రజలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ డైవర్షన్లు, పార్కింగ్ ఏర్పాట్లు ముందుగానే ప్రణాళిక చేసినట్టు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, వేణుగోపాల్ ,స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్పంచ్ నామినేషన్ షురూ....

(మొదటి పేజీ తరువాయి...)

అప్లికేషన్ ని ఉపసంహరణ చేసుకోవచ్చు, అదేవిధంగా పోటీదారుల జాబితాను రిటర్నింగ్ అధికారిని బరిలో నిలుస్తున్నటువంటి అభ్యర్థులు జాబితాను విడుదల చేస్తారు.

**నామినేషన్ కు అవసరమైన పత్రాలు (సర్పంచ్ / వార్డు సభ్యుడు)**

1. నామినేషన్ పత్రం (ఫారం–3)
2. ఎన్నికల ఖర్చుల వివరాలు
3. ఆస్తుల వివరాలు
4. బలపరిచే వ్యక్తుల వివరాలు

**నామినేషన్ కు అవసరమైన ధృవపత్రాలు:**

1. ఓటరు గుర్తింపు పత్రం
2. ఆధార్ పత్రం
3. శూన్య నిల్వ / కొత్త బ్యాంకు ఖాతా పత్రం
4. బకాయిలేని ధృవీకరణ పత్రం (నో డ్యూ సర్టిఫికేట్) మరియు ఇంటి పన్ను రసీదు
5. కుల ధృవీకరణ పత్రం (ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులకు)
6. 21 సంవత్సరాల వయస్సు నిర్ధారణ పత్రం (ఎస్సెస్సీ మెమో / బోనాఫైడ్ / ఓటరు గుర్తింపు పత్రం / ఆధార్ / జనన ధృవీకరణ పత్రం)
7. గ్రామపంచాయతీ తుద ఓటరు జాబితా (ఇటీవలి)లో ఉన్న క్రమ సంఖ్య ప్రతులు
8. అభ్యర్థి ఫోటోలు – 2

**బలపరిచే వ్యక్తులకు అవసరమైన ధృవపత్రాలు:**

1. ఓటరు గుర్తింపు పత్రం
2. ఆధార్ పత్రం
3. బకాయిలేని ధృవీకరణ పత్రం మరియు ఇంటి పన్ను రసీదు
4. గ్రామపంచాయతీ తుద ఓటరు జాబితాలో (ఇటీవలి) క్రమ సంఖ్య ప్రతులు

**గమనిక:** వార్డు సభ్యుడు పోటీ చేసే చోటకు బలపరిచే ప్రతిపాదకులు ఆ వార్డుకు చెందినవారు కావాలి.

**డిపాజిట్ (భద్రతా మొత్తం):**

సర్పంచ్: సాధారణ అభ్యర్థులు – రూ. 2000
ఎస్సీ, ఎస్టీ, బీసీ – రూ. 1000
వార్డు సభ్యుడు: సాధారణ అభ్యర్థులు – రూ. 500
ఎస్సీ, ఎస్టీ, బీసీ – రూ. 250.

## సుభాష్ నగర్ మాజీ సర్పంచ్ మిస్సింగ్

(మొదటి పేజీ తరువాయి...)

వాకబు చేశామని, అయినా కానీ ఆచూకీ తెలియడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం ఇల్లందు పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ అయినట్లు ఫిర్యాదు చేశామన్నారు. తమ ఇంట్లో ఎలాంటి గొడవలు లేవని, తాము ఎవరితో ఘర్షణలు పెట్టుకోమని తెలిపారు. డిసెంబర్ 3న సుభాష్ నగర్ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా వల్లాల మంగమ్మ నామినేషన్ వేయనున్నట్లు తెలుస్తుంది. మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ మిస్సింగ్ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్–హరిసింగ్ నాయక్ దంపతులు సుభాష్ నగర్ లోని మంగమ్మ ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబ సభ్యులు సైతం మంగమ్మ ఆచూకీ తెలియకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు హరిప్రియ తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో వల్లాల మంగమ్మ గెలుపు ఖాయమని ఈ నేపథ్యంలో రాజకీయంగా ఏమైనా కుట్రలు జరుగుతున్నాయా అనే విషయంపై ఇల్లెందులో సర్వత్ర చర్చ కొనసాగుతుంది. ఏది ఏమైనా వల్లాల మంగమ్మ మిస్సింగ్ విషయంపై పోలీసులు సైతం విచారిస్తున్నట్లు సమాచారం. ఇటు మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ భర్త వల్లాల నరసయ్య సైతం తాము బిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు.



# అవినీతి కాంగ్రెస్ మతోన్మాద బిజెపి కూటములను ఓడించాలి

- నీతిమంతామైన పాలన కోసం సిపిఐ ఎం బిఆర్ఎస్ జిడిపిల కూటమిని గెలిపించాలి.
- భద్రాచలం పట్టణాని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేస్తాం
- కూటమి సర్పంచ్ అభ్యర్థి మానే రామ కృష్ణ
- ప్రజా ప్రదర్శన నిర్వహించి నామినేషన్ పత్రాలు సమర్పించిన సిపిఐఎం, బీఆర్ఎస్, జిడిపి కూటమి





**భద్రాచలం టౌన్, నవంబర్ 29(ప్రజా జ్యోతి )**అవినీతి కాంగ్రెస్ మతోన్మాద బిజెపి అపవిత్ర పొత్తులతో కూడిన కూటములను చిత్తుచిత్తుగా ఓడించి ప్రజా సంక్షేమం కోసం జత కట్టిన సిపి ఐఎం బిఆర్ఎస్ జిడిపి కూటమి అభ్యర్థులను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించి భద్రాచల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సిపిఐ ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ పిలుపునిచ్చారు. శనివారం సిపిఐఎం బిఆర్ఎస్ జిడిపి అభ్యర్థుల నామినేషన్ సందర్భంగా పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి అమరవీరుల స్థూపాల వద్ద అమరజీవి సున్నం రాజయ్య కుంజ బుజ్జి స్తూపాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి బిఆర్ఎస్ కన్వీనర్ సునీల్ అధ్యక్షతన జరిగిన సభలో ఏజే రమేష్ మాట్లాడారు. పుష్కర కాలం తర్వాత భద్రాచలం పంచాయతీకి జరుగుతున్న ఎన్నికలలో నీతివంతమైన పాలన కోసం బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని స్పష్టం చేశారు. రెండుగా చీలిపోయిన కాంగ్రెస్ గ్రూపులలో ఎవరు అసలు ఎవరు నకిలీ యో ఆ పార్టీ కార్యకర్తలకు కూడా తెలియని పరిస్థితి ఏర్పడిందని కేవలం అవినీతి సంపాదన కోసమే కాంగ్రెస్ పార్టీలోని గ్రూపులుగా కట్టి పాకులాడుతున్నారు తప్ప ప్రజా సంక్షేమం కోసం ఏమాత్రం ఆలోచించడం లేదని అన్నారు. మతం పేరుతో కులం పేరుతో దేశాన్ని విభజించాలని చూస్తున్న బిజెపి వంటి మతోన్మాద పార్టీలకు భద్రాచలంలో చోటు లేదని రానున్న పంచాయతీ ఎన్నికలలో మతోన్మాద బిజెపి అవినీతి కాంగ్రెస్ కి పట్టణ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

**భద్రాచల పట్టణాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేస్తాం**

**సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ**

సిపిఐఎం జిడిపి పార్టీల మద్దతుతో పట్టణ ప్రజల ఆశీర్వాదంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక మెజార్టీ ఓట్లతో గెలిచి భద్రాచలం సర్పంచిగా పట్టణాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేస్తానని సిపిఐఎం బిఆర్ఎస్ జిడిపి కూటమి సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ తెలిపారు. రెండేళ్లలో కాంగ్రెస్ పాలనలో అవినీతి రాజ్యమేలిందని అక్రమ ఇసుక వ్యాపారం తప్ప స్థానిక శాసన సభ్యులు చేసింది ఏమీ లేదని ఆయన ఆరోపించారు. భద్రాచలం అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికను రచించి అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. రామాలయ అభివృద్ధితోపాటు భద్రాచల పట్టణాన్ని ముంపు నుండి కాపాడుకునేందుకు కరకట్ట పునర్ నిర్మాణ పనులకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**అమరవీరుల స్ఫూర్తితో నిస్వార్ధ పాలనను అందిస్తాం**

**సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి**

భద్రాచలం శాసనసభ్యులుగా పనిచేసి ఏ ఒక్క అవినీతి మరక లేకుండా నిజాయితీ పాలన అందించిన అమరవీరులు కుంజా బుజ్జి సున్నం రాజయ్య స్ఫూర్తితో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీలో అవినీతి రహిత పాలనను అందిస్తామని సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి స్పష్టం చేశారు. సిపిఐ ఎం ప్రజా ప్రతినిధులు ఉన్న కాలంలోనే భద్రాచలం పట్టణానికి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి డిగ్రీ కళాశాల జూనియర్ కళాశాల మంచినీటి ట్యాంకులు నిర్మించబడ్డాయని ఏడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క అభివృద్ధి జరగలేదని కేవలం ఇసుక అక్రమ రవాణా తప్ప వారు చేసిన అభివృద్ధి ఏమీ లేదని నర్సారెడ్డి విమర్శించారు. కుల మతాలకు అతీతంగా కలిసి ఉండే భద్రాచలం పట్టణంలో మతోన్మాద బిజెపికి స్థానం లేదని విభజన రాజకీయాలు చేసే మతోన్మాద కూటమిని ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించాలని నర్సారెడ్డి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం అభ్యర్థులు బండారు శరత్ బాబు ఎర్రంశెట్టి వెంకటరామారావు సున్నం గంగ కుంజ శ్రీనివాస్ రావు ఇరపఅనసూయ తో పాటు టిఆర్ఎస్ నాయకులు ప్రమోద్ కుమార్ తుమ్మలపల్లి ధనేశ్వరరావు రామకృష్ణ సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పారేలు సంతోష్ కుమార్ డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు లీలావతి జ్యోతి అజయ్ కుమార్ కొలగాని రమేష్ చుక్క మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ భద్రాద్రి సేవలు అభినందనీయం



**భద్రాచలం టౌన్, నవంబర్ 29(ప్రజాజ్యోతి )** పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ భద్రాద్రి సేవలు అభినందనీయం అని టి. ఎన్. జి. వో. అధ్యక్ష కార్యదర్శులు డెక్కా నరసింహారావు, గగ్గూరి బాలకృష్ణ అన్నారు. స్థానిక టి. ఎన్. జి. ఓ కార్యాలయంలో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలం పట్టణంలో గత 14 సంవత్సరాల నుండి గ్రీన్ భద్రాద్రి చేస్తున్న కార్యక్రమాలు వెల కట్టలేనివని, పర్యావరణం కాపాడటానికి మనమందరం కృషి చేయాలని,విరివిగా మొక్కలు నాటి, కాలుష్యాన్ని తొలగించి, మంచి వాతావరణం కల్పించవలసిన భాద్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, లేకపోతే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవని, ఈ సంవత్సరం గ్రీన్ భద్రాద్రి తొలి మహిళా అధ్యక్షురాలుశ్రీమతి చిట్టే లలిత భద్రాచలం పట్టణం లో విశేషం గా మొక్కలు నాటుతూ మంచి కార్యక్రమాలు చేస్తుండటం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షురాలు చిట్టే లలిత, గ్రీన్ భద్రాద్రి పూర్వ అధ్యక్షులు గోళ్ళ భూపతిరావు,గౌతమి రామకృష్ణారెడ్డి, గాలి రామ్ మోహన్ రావు, గ్రీన్ భద్రాద్రి కో ఆర్డినేటర్ పామరాజు తిరుమలరావు, టి. ఎన్. జి. వో. నాయకులు పడిగ నరసింహారావు ప్రమోద్ కుమార్ కిరణ్ శ్రీనివాస్ రామకృష్ణ సాదిక్ పాషా వెంకటేష్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవం వద్దు ఎలక్షనే ముద్దు సిపిఎం పార్టీ

- ఆశ కంటే ఆశయం ముఖ్యం సిపిఎం బరిలో ఉంటుంది




**జూలూరుపాడు నవంబర్ 29 ప్రజాజ్యోతి**డిసెంబర్ 17న మూడోదప జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో నిత్యం ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఇవాళ గ్రామాలలో ఏకగ్రీవాల పేరుతో జరుగుతున్న ప్రయత్నాలు ప్రజాస్వామ్యాన్ని అపఅహస్యం చేస్తున్నాయనిజిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీ లలో జరుగుతున్న ఏకగ్రీవాలపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్ జూలూరుపాడు లో శనివారం సిపిఎం పార్టీ మండల కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఎన్నికల సంఘాన్ని కోరారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏకగ్రీవాలు జరుగుతున్న గ్రామపంచాయతీలలో ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు ఏకగ్రీవ ఎన్నికల వల్ల కులం డబ్బు ప్రతిపాదన కేవలం పెత్తందారులకు ధనవంతులకు మాత్రమే రాజకీయ అవకాశం ఉంటుందని అన్నారు, ఏకగ్రీవ ఎన్నికల ద్వారా ప్రజలు రాజ్యాంగం కల్పించిన ఓటు వేసే హక్కును ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ప్రజాప్రతినిధిని ఎన్నుకునే హక్కు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఏకగ్రీవాల పేరుతో ప్రజలకు ప్రజాస్వామ్యాన్ని దూరం చేసి ప్రజాస్వామ్య వ్యవస్థనే అపహాసం చేస్తున్నారని అన్నారు లక్షలు కోట్లు ఖర్చుపెట్టి ఏకీగ్రవాలు చేసుకున్న అభ్యర్థులు గ్రామ అభివృద్ధికి ఏం కృషి చేస్తారని ప్రశ్నించారు ఏకగ్రీవాలు జరుగుతున్న గ్రామాలలో ప్రజలందరూ పాల్గొనడం లేదని కేవలం కొంతమంది మాత్రమే నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు ఇలా ఏకగ్రీవాలు చేయడం ద్వారా ప్రజాస్వామ్యానికి ఇబ్బంది కలిగేలా ఉందని ఆయన అన్నారు ఇలాంటి ఏకగ్రీవాలు జరగకుండా ఎన్నికల సంఘం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా జూలూరుపాడు మండలంలో అన్ని గ్రామపంచాయతీలలో సిపిఎం పార్టీ చేస్తుందని పోటీ చేస్తున్న సిపిఎం పార్టీ అభ్యర్థుల్ని గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అన్నారు ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి యాస నరేష్ మండల కమిటీ సభ్యులు వి చందర్ రావు, గార్లపాటి వెంకటి, కనక రత్నం, జె రాధాకృష్ణ, దారావత్ రమేష్, బోడ అబిమిత్ర, బొల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

# టీఎస్ యుటిఎఫ్ టేకులపల్లి మండల నూతన కమిటీ ఎంపిక



**టేకులపల్లి,నవంబర్29, ప్రజా జ్యోతి:** టీఎస్ యుటిఎఫ్ టేకులపల్లి మండల అధ్యక్షులుగా ధరావత్ హరికుమార్,ప్రధాన కార్యదర్శిగా టీ.లక్ష్మణ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఏర్పాటు చేసిన టీఎస్ యుటిఎఫ్ 12వ మహాసభలలో టేకులపల్లి మండల నూతన కమిటీని టీఎస్ ఈటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్య కిషోర్ సింగ్ , జిల్లా ఉపాధ్యక్షులు వి. వరలక్ష్మి,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం టీఎస్ యుటిఎఫ్ 12వ మహాసభలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహాసభల్లో పూర్వం మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణారాజుని స్మరించుకుంటూ వారికి సంతాపం తెలియజేశారు. ఈ ఎన్నికల అధికారిగా భూక్య కిషోర్ సింగ్ వ్యవహరిస్తూ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యుల సలహా సూచనలతో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఇంతటి గొప్ప అవకాశానిచ్చినటువంటి రాష్ట్ర కమిటీ సభ్యులకు,జిల్లా కమిటీ సభ్యులకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చినటువంటి ఈ గొప్ప అవకాశాన్ని చదివినయం చేసుకొని ఉపాధ్యాయులకు సమస్యలు తలెత్తినప్పుడు అంటే ఉంటూ సమస్యలు తీరేదాకా వారి వెంట నడుస్తూ వారికి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. కోశాధికారిగా లక్ష్మణ్ ని, ఉపాధ్యక్షులుగా బి మాన్సింగ్, వై భానుప్రియను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో టి ఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మరణించిన వారి కుటుంబానికి ఆర్థిక సాయం

- మానవత్వాన్ని చాటుకుంటున్న కొర్సా రమేష్



**జూలూరుపాడు నవంబర్ 29( ప్రజా జ్యోతి )**మండల పరిధిలోనిఅనంతారం గ్రామానికి చెందిన కోరం నాగేశ్వరరావు గత పది రోజుల క్రితమే కిడ్నీ వ్యాధితో మరణించినారు వారి కుటుంబ అవసరాలకు నేనున్నానని తన వంతు సహాయాన్ని 5 వేల రూపాయలను కోర్స రమేష్ శనివారం అందించారు. గ్రామంలో బీదవాడు చనిపోతే వారి కుటుంబానికి తన వంతు సహాయంగా అందిస్తూ రమేష్ ఆదుకుంటున్నారు. గతంలో కూడా గ్రామంలో ఇబ్బందులతో ఉన్నవారిని సైతం కొరసా రమేష్ మానవత్వాన్ని చాటుకుంటూ ఆర్థిక సాయం అందిస్తున్నారు. అయితే ఆర్థిక సహాయం అందుకున్న కుటుంబ సభ్యులు కొరసా రమేష్‌కు అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా కురసా రమేష్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి అత్యవసర సమయాల్లో ఆర్థికంగా ఆదుకోవడానికి తనవంతు కృషి చేస్తానని అన్నారుఈ కార్యక్రమంలో ఇసుకల వెంకటేశ్వర్లు మలకం వీరభద్రం, మలకం నాగరాజు, కల్తీ హనుమంతరావు ,కుంజ సతీష్, ఈసం రవీందర్, మందరకల తిరుమలేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముగిసిన తొలి విడత నామినేషన్ల ప్రక్రియ

- చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థుల ఉత్కంఠతకు తెర
- రాత్రి వరకు కొనసాగిన నామినేషన్లు



**చర్ల, నవంబర్ 29:(ప్రజా జ్యోతి ):** తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికలలో చర్ల మండలంలో 232 వార్డులు 26 పంచాయితీలులలో మండల కేంద్రంలో 16 వార్డులకు గాను తొలి విడత నామినేషన్ల ప్రక్రియ శనివారం ముగిసింది. చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ పదవికి గత మూడు రోజులుగా ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై చేసిన కసరత్తు గెలుపు గుర్రాల ప్రయత్నాలకు శనివారం ఆ ఉత్కంఠతకు ముగింపు పలికారు. అభ్యర్థుల ఎంపికను రాజకీయ పార్టీలతో పాటు చర్ల మండల వాసులు కూడా నిశితముగా పరిశీలించి ఏ పార్టీకి ఏ అభ్యర్థి వస్తారో అని మండల వ్యాప్తంగా చర్చించుకున్నారు. చర్ల మేజర్ పంచాయతీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రధాన రాజకీయ పార్టీలు గెలిచే అభ్యర్థుల ఎంపికలో బేరీజువేసి శనివారం ఆయా పార్టీలతో మద్దతుదారులతో నామినేషన్ వేయించడం జరిగినది. దీనిలో భాగంగా చర్ల మేజర్ పంచాయతీ బిజెపి అభ్యర్థిగా ఎట్టి ఆమని నామినేషన్ను దాఖలు చేశారు . బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా సిపిఎం పార్టీ బలపరిచిన సోయం కృష్ణవేణి నామినేషన్ను దాఖలు చేయగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పూజారి సామ్రాజ్యం, బీఎస్పీ పార్టీ అభ్యర్థిగా శ్రీమతి గుర్రాల దుర్గాభవాని నామినేషన్లను దాఖలు చేశారు .ఈ నామినేషన్లతో గత మూడు రోజులుగా చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థుల పై ఉన్న ఉత్కంఠతకు తెరపడింది. చర్ల మండల పంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో బిజెపి అభ్యర్థులుగా తేగడ లో బోడిక సందీప్, పర్ణశాల రాళ్ళగూడెం దేవరపల్లి అభ్యర్థిగా కొమరం సుధారాణి, ఉప్పరగూడెం సర్పంచ్ అభ్యర్థిగా పరిశిక సౌజన్య, సి కత్తి గూడెం గ్రామంలో ఇరప జ్యోతి ,చిన్న మిడిసిలేరులో సోది జానకి లు శనివారం బీజేపీ పార్టీ తరపు నామినేషన్ను దాఖలు చేయడం జరిగినది. ఐదు గంటలకే నామినేషన్ల సమర్పించే సమయం ఉండటంతో వార్డు మెంబర్లు అభ్యర్థులు పంచాయతీ ఆఫీసు వద్ద బారులు తీరి నిలబడ్డారు. తొలి విడత నామినేషన్ లో భాగంగా శనివారం చర్ల మండలంలో పంచాయితీ నామినేషన్ల ప్రక్రియ ముగిసింది.





## మండలంలో 3వ విడత ఎన్నికలు

- 17న స్థానిక సంస్థల ఎన్నికలు



**టేకులపల్లి,నవంబర్29,ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల స్థానిక ఎన్నికల 17వ తేదీ షెడ్యూల్ విడుదల చేయడంతో టేకులపల్లి మండలంలో 3వ విడత ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు అందుకు అభ్యర్థులను ప్రకటించి వారికి ఎమ్మెల్యే కోరం కనకయ్య అండదండలతో మండలంలోని టేకులపల్లి, దాసుతండా,గోల్యతండా పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో సమావేశం ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రజలకు, రైతన్నలకు, అండగా నిలిస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు, ఇందిరమ్మ ఇళ్ళు, ఉచిత కరెంటు, రైతు రుణమాఫీ,గ్యాస్ సబ్సిడీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,వడ్డీ లేని రుణాలు, మరెన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రజలకు అందిస్తూ మహిళలు పెద్ద పీట వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను అత్యధిక స్థానాలలో గెలిపించుకొని గ్రామాల్లో అభివృద్ధి చేసుకోవాలి.అభ్యర్థులను ప్రజల అభిప్రాయాల మేరకు ఎంపిక చేయడం జరుగుతుందని,అంతర్గత విబేధాలను పక్కన పెట్టి అందరిని కలుపుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే విధంగా అందరూ కృషి చేయాలి.ఇందిరమ్మ ప్రభుత్వంలో రానున్న రోజుల్లో మరెన్నో అభివృద్ధి పనులను చేయిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి రైతన్నలకు, కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కోరం కనకయ్య కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి బలపర్చిన అభ్యర్థులను తప్పకుండా గెలిపించుకొని తమ గ్రామాలను అభివృద్ధి చేసుకుంటామని ప్రజలు హామీ ఇవ్వటం జరిగినది.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ , మండల అధ్యక్షులు దేవా నాయక్ , మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా పట్టివేత

**టేకులపల్లి,నవంబర్ 29, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని లచ్చ తండా, హనుమతండ, ముత్యాలంపాడు, కొయ్యగూడెం, బిల్లుడు తండా గ్రామాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ఆరు లీటర్ల నాటు సారా స్వాధీనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. నాటు సారా తో పట్టుబడిన కన్నబోయిన రమణ, బాదావత్ శారద, లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ టాస్క్ ఫోర్ సిబ్బంది రామకృష్ణ గౌడ్, వెంకట నారాయణ, సుమంత్, శ్రావణి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ



**టేకులపల్లి,నవంబర్29, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్ ఆదేశాల మేరకు టేకులపల్లి మండలంలోని ఆర్సిపేట గ్రామపంచాయతీ పరిధిలోని మొరుట్ల పరికల చెరువు లో ఫీల్డ్ ఆఫీసర్ అనిల్, డేటా ఎంట్రీ ఆపరేటర్ సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత చేపల పిల్లలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అలాగే రోల్లపాడు పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులో ఉచిత చేపల పిల్లల పంపిణీ చేశారు. గిరిజన సొసైటీలో నూరు శాతం సబ్సిడీతో 1,32,000 చేప పిల్లలను రోళ్లపాడు చెరువులో వదిలారు. ఆర్సిపేట పంచాయతీ పరిధిలోని మొరట్ల పరికల చెరువులో 72000 ఉచిత చేప పిల్లలను చెరువులో వదిలారు. ఈ కార్యక్రమంలో సొసైటీ జిల్లా అధ్యక్షులు జోగబుచ్చయ్య, మత్స్య శాఖ అధికారులు, మత్స్య శాఖ రోళ్ళపాడు సొసైటీ సభ్యులు చీమల రామయ్య, చీమల లక్ష్మీనారాయణ, కార్యదర్శి రాజు, ఆర్సిపేట పంచాయతీ మురట్ల పరికల వాగు మత్స్యశాఖ సొసైటీ సభ్యులు అధ్యక్షులు మొడిగ నరసింహారావు , రాజు, కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాహార దీక్ష మొదలు పెట్టి ఢిల్లీ మెడలు వంచిన నేత కేసీఆర్

- అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన నేత కెసిఆర్
- కాపు సీతాలక్ష్మి, కాపు కృష్ణ



**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 29 – ప్రజాజ్యోతి:** దీక్షతో ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహోన్నత నేత కేసీఆర్ అని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పదేళ్లపాటు రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిన నేతా కేసీఆర్ అని కొనియాడారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందని, ఏ ఒక్క హామీలను అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచిందని మండిపడ్డారు. తులం బంగారం, మహిళలకు రూ.2500, 4 వేలకు పెన్షన్ పెంచలేదని, రూ.15వేలు ఇస్తామన్న రైతు బందును పూర్తిగా ఎగ్గొట్టారని విమర్శించారు. 6 గ్యారంటీలు 420 హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీని స్థానిక ఎన్నికల్లో భూస్థాపితం చేయాలని స్పష్టం చేశారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పార్టీ ఆవిర్భావం నాటి నుంచి ఎన్నో కష్టాలకు ఓర్చి ఉద్యమంలో భాగస్వాములు అయ్యామని తెలిపారు.కెసిఆర్ వెంట సింగరేణి కార్మికులు నడిచారు అన్నారు.నాడు పిడికెడు మందితో పోరాటం చేస్తే హేళన చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 4 కోట్ల మంది ప్రజలను ప్రభావితం చేసిన కెసిఆర్ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగస్వామ్యం ఉన్నందుకు సంతోషంగా ఉందన్నారు. కేసీఆర్ లేనిదే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదన్నారు.. అబద్ధపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని పంచాయతీ ఎలక్షన్ లలో కోలుకోలేని దెబ్బ కొట్టాలని పిలుపునిచ్చారు.

## ముగిసిన జమేదార్లకు పున:శ్చరణ శిక్షణా తరగతులు...



**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 29 – ప్రజాజ్యోతి:** సింగరేణి వ్యాప్తముగా గల ఎస్&పి సి జమేదార్లకు విడతల వారీగా నిర్వహించే పునశ్చరణ శిక్షణా తరగతులలో భాగముగా ఈనెల 24 నుండి 29వ తేదీ వరకు కొత్తగూడెం ఎస్&పి సి ట్రైనింగ్ సెంటర్ లో నిర్వహించిన 14వ జమేదార్ల పున:శ్చరణ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనరల్ మేనేజర్ (సెక్యూరిటీ) చందా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యం అని, మనం క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నపుడే మనకు గుర్తింపు వస్తుందని, జమేదార్లు ఫ్రంట్ లైన్ సూపర్ వైజర్ గా కీలకపాత్ర పోషిస్తారని, యస్&పిసి ప్రధాన విధులలో సెక్యూరిటీ సిబ్బంది అందరూ డ్రెస్, డ్యూటీ, హానర్ కోడ్ కఠినంగా పాటించేలా చూడాలని, రోజువారి సెక్యూరిటీ సిబ్బంది విధులను మానిటరింగ్ చేస్తూ సరియైన రిపోర్టు పై అధికారులకు అందజేయాలని, సెక్యూరిటీ గార్డులు అందరిలో సత్ప్రవర్తన పొందేలా చూడాలని, నీతి నిజాయితీతో, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శవంతంగా ఉండాలని తెలిపారు. జమేదారులు అందరిచే శ్రీజ్యోతి అనాథ వృద్ధుల శరణాలయానికి నిత్యవసరాలను వితరణ చేశారు. అనంతరం ఉత్తమ ట్రైనీలుగా ఎంపిక కాబడిన యల్.కమల్ సింగ్, ఎ.రాజశేఖర్, జె.రాంమూర్తి గార్లకు బహుమతులను అందజేశారు. యం.డి.జాకీర్ హుస్సేన్, ట్రైనింగ్ అధికారి మాట్లాడుతూ... శిక్షణా కాలంలో అందరూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, ఇక్కడ నేర్చుకున్న అంశాలను విధులలో అన్వయిస్తూ, సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తున్నపుడే మనకు గుర్తింపు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.నారాయణరెడ్డి, ట్రైనింగ్ ఇన్ స్పెక్టర్, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల సమరానికి బీఎస్పీ" సై"

- చర్ల మేజర్ సర్పంచ్ బీఎస్పీ అభ్యర్థిగా శ్రీమతి గుర్రాల దుర్గాభవాని నామినేషన్
- అన్ని స్థానాల్లో బీఎస్పీ అభ్యర్థుల పోటీ
- ప్రధాన పార్టీలకు ధీటుగా అడుగులు
- గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు



**చర్ల, నవంబర్ 29: (ప్రజా జ్యోతి ):** చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ బీఎస్పీ అభ్యర్థిగా శ్రీమతి గుర్రాల దుర్గ భవాని శనివారం నామినేషన్ దాఖలు చేశారు. చర్ల మండల పంచాయతీ ఎన్నికల సమరానికి బీఎస్పీ" సై "అంటున్నది. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బి ఆర్ఎస్, బిజెపి ,సీపీఐ ,సీపీఎం పార్టీలకు పంచాయతీ ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చే దిశగా బీఎస్పీ పార్టీ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు తడికల శివకుమార్ నేతృత్వంలో భద్రాచలం బీఎస్పీ అధ్యక్షుడు కొండ చరణ్ మండల అధ్యక్షులు పడిగల వెంకటేశ్వర్లు చర్ల మండల లోని పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని గెలుపు పై గెలుపు గుర్రాలను ఎంచుకొనులో పనిలో భాగంగా మండలంలోని అన్ని స్థానాల్లో బీఎస్పీ పోటీ చేస్తూ ప్రధాన పార్టీలకు పోటీ ఇవ్వనున్నది అని బీఎస్పీ కార్యకర్తలు అంటున్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ బిఎస్పీ పార్టీ అధినేత మాయావతి ఆశయాలకు అనుగుణంగా బహుజన వాదాన్ని బలంగా వినిపిస్తూ అందరికీ అవకాశాలు కల్పించే దిశగా తమ వాణిని ఎప్పటికప్పుడు వినిపిస్తున్న బీఎస్పీ పార్టీ రానున్న గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలిచి తమ సత్తాను నిరూపించుకోవాలని చూస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ ,బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి తీసుకువెళ్లి మండల అభివృద్ధిలో వారు చేసిన పొరపాటులను తప్పులను ఎత్తిచూపి బీఎస్పీకి అధికారం ఇచ్చినట్లయితే మండలానికి ఏమేమి చేస్తారో అని తెలియజేసే విధంగా ముందుకు పోయేలా సిద్ధమవుతున్నారని బీఎస్పీ శ్రేణులు అంటున్నారు .కాంగ్రెస్ ,బిజెపి ,బిఆర్ఎస్ వైఫల్యాలే బీఎస్పీకి కలిసి వచ్చే అంశాలుగా పంచాయితీ ఎన్నికలలో గెలుపుకు ప్రధాన అంశాలుగా బిఎస్పి పార్టీ వారు అభిప్రాయపడుతున్నారు. చర్ల మండలంలోని అధ్వానంగా మారిన రోడ్లు ,పంచాయతీ నిధులు లేక అస్తవ్యస్తంగా మారిన మండల పాలన లాంటి అంశాలను ప్రజలలోకి తీసుకువెళ్లి తమ వాణిని వినిపించి గెలుపుకై కృషి చేస్తున్నట్లు బీఎస్పి వర్గాలు అంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను గెలిపించిన మండల వాసులు ఇరు పార్టీలు మండలానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదని నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడుతున్న బీఎస్పీ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని అవకాశం ఇచ్చినట్లయితే అభివృద్ధి చేసి చూపుతామని మిగతా పార్టీలకు ఆదర్శంగా నిలుస్తామని మండల అభివృద్ధిలో బీఎస్పీ మార్క్ ను సెట్ చేస్తామని అంటున్నారు. ప్రధాన పార్టీలే కాకుండా మేము కూడా ఎన్నికల బరిలో ఉండి గెలుపే లక్ష్యంగా మండల అభివృద్దే మా ధ్యేయంగా పని చేస్తామని ఓటర్ మహాశయులను ఒప్పించే దిశగా బీఎస్పీ అభ్యర్థులకు ఓటు వేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు అని మండల బిఎస్పీ కార్యకర్తలు అంటున్నారు . ఏది ఏమైనాప్పటికీ ఓటరు మహాశయుని అభిప్రాయం తెలియడానికి ఫలితాలు వచ్చేదాకా మండలంలోని అన్ని రాజకీయ పార్టీలతో పాటు మండల వాసులు ఎదురు చూడాలి.

## సర్పంచ్ ఎలక్షన్ బరిలో గుగులోతు లక్ష్మి



**పాల్వంచ(రూరల్),నవంబర్ 29(ప్రజాజ్యోతి):** పాల్వంచ మండలంలోని పాత సూరారం గ్రామపంచాయతీకి చెందిన గుగులోతు లక్ష్మి w/o రామ్ చందర్ జరగబోయే రెండో విడత సర్పంచ్ ఎలక్షన్ బరిలో నామినేషన్ వేయబోతున్నట్టు పేర్కొన్నారు,గత ఎలక్షన్లో ఇతని కుమారుడు నరేష్ వార్డ్ మెంబర్గా గెలిచి గ్రామంలో ఉన్నటువంటి సమస్యలపై నిత్యం ప్రజల్లో అందుబాటులో ఉండి సేవలు అందించారు.ఇదే తరుణంలో ఈసారి ఎలక్షన్లో తల్లిగా నేను పోటీ చేసి గ్రామంలో ఉన్నటువంటి సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తానని,గ్రామంలో ఉన్నటువంటి ప్రజలకు అందుబాటులో ఉండి,గ్రామ సమస్యపై ప్రజా పోరాటం చేస్తా,నితం అందరికీ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.గ్రామపంచాయతీలో ఉన్నటువంటి ప్రజలు నన్ను ఆదరించి ఒక్కసారి అవకాశం ఇస్తే నా వంతు అభివృద్ధి చేస్తానని తన పేర్కొన్నారు.

## కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి గా నామినేషన్ వేసిన భూక్య శ్వేత నామినేషన్



**భద్రాచలం టౌన్, నవంబర్ 29 ( ప్రజా జ్యోతి):** భద్రాచలం సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల చివరి రోజు సందర్భంగా భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా మాజీ సర్పంచ్ భూక్య శ్వేత సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా భూక్య శ్వేత మాట్లాడుతూ, గతంలో తన సర్పంచ్ పదవీకాలంలో గ్రామాభివృద్ధి కోసం ఎన్నో శాశ్వత కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పల్లె పచ్చదనం, తాగునీటి సమస్యలు, రహదారి మరమ్మతులు, విద్యుత్ సౌకర్యాలు, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి తాను ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు తెలిపారు. గ్రామ ప్రజల నమ్మకం, ఆశీర్వాదాలు తమకు బలమని, తిరిగి ప్రజాసేవ కోసం ముందుకు వస్తున్నానని అన్నారు.గ్రామ అభివృద్ధి వేగవంతం చేయడం, పారదర్శక పాలన, సమస్యల పరిష్కారానికి తక్షణ స్పందన తన ప్రధాన లక్ష్యాలని కూడా భూక్య శ్వేత స్పష్టం చేశారు. నామినేషన్ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## భద్రాచలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా.

- - స్వతంత్ర అభ్యర్థి పూనెం ప్రదీప్ కుమార్.



**భద్రాచలం టౌన్, నవంబర్ 29 (ప్రజాజ్యోతి)** భద్రాచలం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న పూనెం ప్రదీప్ కుమార్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం నిజమైన అభివృద్ధి కోసం ప్రజలు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. తన విజయం వ్యక్తిగత గెలుపు కాదని, పట్టణ అభివృద్ధికి ప్రజల ఆశయాలకు ప్రతీకగా భావిస్తున్నానని తెలిపారు. భద్రాచలంలో ప్రధానంగా పరిష్కారం కావాల్సిన సమస్యలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతానని చెప్పారు. పట్టణంలోని అన్ని కాలనీలలో మౌలిక సౌకర్యాల కల్పన, శుభ్రత, కాలువల విస్తరణ, రహదారుల మరమ్మతులు, ముంపు నివారణ చర్యలు వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటానని ప్రకటించారు. పార్టీలకు అతీతంగా, ప్రజలే తన బలం అని, వారి నమ్మకమే విజయం దిశగా నడిపిస్తుందని పూనెం ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. ఎవరి ఒత్తిడులూ, ఎలాంటి రాజకీయ స్వార్థాలూ లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా భద్రాచల ప్రజలకు నిస్వార్థ సేవ అందించడమే తన లక్ష్యమని చెప్పారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో రేపాక రామారావు గుప్తా, గుమ్మలూరి శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

## అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఘనంగా మండల పూజలు

**పాల్వంచ టౌన్, నవంబర్ 29(ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ప్రసిద్ధ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో మండల పూజలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేరళ తంత్రుల చేత ప్రత్యేక పూజలు, అభిషేకాలు,ఆలయ వేదోపదేశాలతో కార్యక్రమాలు భక్తిని మరింతగా ఉట్టిపడేలా చేశాయి.మండల పూజల సందర్భంగా బొల్లూరుగూడెం రామాలయం నుండి పాల్వంచ పట్టణ పురవీధుల మీదుగా నగర సంకీర్తనను కేరళ సాంప్రదాయ వాయిద్యాల నడుమ భారీగా నిర్వహించారు. భక్తులు “స్వామియే శరణం అయ్యప్ప” నినాదాలతో పట్టణం అంతటా ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.తరువాత నిర్వహించిన అగ్నిగుండ కార్యక్రమంలో అయ్యప్ప మాలదారులు వందలాదిగా పాల్గొని అయ్యప్ప స్వామిపై తమ అపారమైన భక్తిని వ్యక్తపరిచారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అచ్చెన్నయ్య,వెంకటేశ్వర్లు,సతీష్తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.మండల పూజలతో పాల్వంచ పట్టణం భక్తిరసమయం గా మారిపోయింది.

## పాల్వంచలో రేగా కాంతారావు సానుభూతి సందర్శనం



**పాల్వంచ(టౌన్), నవంబర్ 29,(ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భరోసా రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) జిల్లా అధ్యక్షులు,పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు శనివారం పాల్వంచలోని సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు వై. రమణమూర్తి నాయుడు (డిష్ నాయుడు )నివాసానికి వెళ్లి,ఇటీవల స్వర్గస్తులైన ఆయన తల్లి పైడితల్లి మరణం పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కుటుంబ సభ్యులను ధైర్యం చెబుతూ మనోధైర్యాన్ని కల్పించారు.ఈ సందర్భంగా టౌన్ అధ్యక్షుడు ఎం. రాజు గౌడ్,మండల అధ్యక్షుడు పూసల విశ్వనాథం,రామ్మూర్తి,మాజీ ఎంపీపీ సరస్వతి,మహిళా బీఆర్ఎస్ నాయకురాలు సింధు తపస్వి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్యా చందు నాయక్,ఆర్.వి.రమణ చౌదరి, ప్రభాకర్ రెడ్డి,కాపు సంఘం నాయకుడు శీలంశెట్టి రంగారావు గారు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



**ఇల్లెందు, నవంబర్ 29, ప్రజాజ్యోతి:** తెలంగాణ జాతిపిత కేసీఆర్ త్యాగాలను గుర్తుచేసుకుంటూ ఉద్యమ నాయకుడు, బిఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ నాయకత్వంలో శనివారం దీక్షా దివాస్ సందర్భంగా తెలంగాణ తల్లికి పూల మాల వేసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ స్మృతులను కేసీఆర్ చేసిన త్యాగాలు మరువలేన్నారు. 2009 నవంబర్ 29న ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపిన కేసీఆర్ తెలంగాణ వచ్చాడో కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో స్మరణ దీక్షకు పూనుకున్నారని, రాష్ట్రం అగ్నిగుండంగా మారిందని పేర్కొన్నారు. ప్రజలంతా రోడ్లమీదకు వచ్చారని, ప్రజా ఉద్యమానికి దిగిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం అయిందని తెలిపారు. కేసీఆర్ దీక్ష విరమించాక తెలంగాణ ప్రజలను వంచన చేస్తూ వలసవాదుల వత్తిడికి తలొగ్గి ప్రకటనను వెనకకు తీసుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జబ్బార్, టీబీజీకేఎస్ రాష్ట్ర నాయకుడు ఎస్. రంగనాథ్, నాయకులు అబ్దుల్ నబి, భావుసింగ్ నాయక్, వసంతరావు, ఉపేందర్, బీబి, మధార్ బీ, కడగంచి వీరస్వామి, పద్మ, మౌనిక, భవాని, భాగ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంకిత భావంతో పనిచేసిన ఎస్ఐ సూర్యం



**ఇల్లెందు, నవంబర్ 29, ప్రజాజ్యోతి:** పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో ఎస్ఐ సూర్యం అంకితభావంతో పని చేశాడని ఇల్లెందు డిఎస్పి ఎన్. చంద్రభాను, ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్లు అన్నారు. పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు విశిష్ట సేవలు అందించి పోలీసులకు ఆదర్శప్రాయంగా నిలిచాడని, సూర్యం పోలీస్ శాఖకు చేసిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. శనివారం ఇల్లందు ఎస్ఐగా పదవి విరమణ చేసిన సూర్యం దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతలను పరిరక్షించడం, కేసుల శోధనలో ఎంతో పట్టుదలతో బాధ్యతాయుతంగా వ్యవహరించారని కొనియాడారు. ఎస్ఐగా సూర్యం పదవి విరమణ చేసినప్పటికీ అందరికీ గుర్తుండిపోయే వ్యక్తి అని అన్నారు. సూర్యం పదవి విరమణ చేసినప్పటికీ ఆయన అనుభవాలను తెలుసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హసీనా, సిబ్బంది పాల్గొన్నారు.